క్లుప్తంగా

బుద్ధ, కల్కి అవతారంలో జగన్నాథుడు



బుద్ధ, కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

విజయనగరం టౌన్: జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా కోళ్ల బజారులో కొలువైన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి బుధవారం బుద్ధ, కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పి.నగేషాచార్యులు, వెంకటరమణాచార్యులు స్వామివారికి పూజాదికాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తరించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన సుందర హరీష్



వైఎస్ జగన్‌తో సుందర హరీష్

భోగాపురం: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భోగాపురం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సుందర హరీష్ మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగంతో జరిగిన సమావేశానికి హాజరైన హరీష్ అధినేతను కలుసుకున్నారు. జగనన్నను కలవడం సంతోషంగా ఉందని హరీష్ తెలిపారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



భోగాపురంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆటో కార్మికులు

భోగాపురం: కేరళ రాష్ట్రం వలె ఏపీలో కూడా ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. భోగాపురం ఆటో స్టాండ్ వద్ద కార్మికులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. విచ్చలవిడిగా చలానాలు విధించడం వలన ఆటో కార్మికులు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా కార్మికులపై ఆర్థిక భారాలు మోపుతూ సొమ్ము చేసుకుంటున్నాయని మండిపడ్డారు. జూలై 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కోరాడ రాము, అప్పారావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మె

- శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ బి.లక్ష్మీ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ఆశ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి బి.సుధారాణి, మహాలక్ష్మీ అధ్యక్షతన బుధవారం ఎల్బీజీ భవన్‌లో ఆశ వర్కర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశ వర్కర్లపై పని భారం తీవ్రంగా పెరుగుతుందని, 24 గంటలు పని చేయాల్సి వస్తుందన్నారు. జీతం మాత్రం పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పెరుగుతున్న ధరల్లో కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ ప్రాథమిక స్థాయిలో ఆరోగ్యం అందించే ఆశా వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు లేకపోవడంతో అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఆశా వర్కర్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విధి నిర్వహణలో ప్రమాదం జరిగిన పట్టించుకోనే నాథుడే లేదన్నారు. పని గంటల పెంపులో పోటీ పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల అనారోగ్య సమస్యలను గుర్తించి నిరంతరం సర్వీస్ అందిస్తున్న ఆశాల సమస్యలను పరిష్కారించడం లేదని, అందుకే జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎ.జగన్మోహనరావు, బి.రమణ, పద్మ, రాజేశ్వరి, వాసవి, కనకమహాలక్ష్మి, ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం...!

- జగనన్న కాలనీలపై ప్రభుత్వ అలసత్వం
- అధికారుల నిర్వాకంతో అడవిని తలిపిస్తున్న రహదారులు
- పిచ్చి మొక్కలతో కాలనీ వాసుల్లో భయాందోళనలు
- ఇళ్లల్లోకి చొరబడుతున్న విష సర్పాలు
- కోర్టు కేసు నెపంతో కాలనీ ముఖం చూడని అధికారులు



కోనాడ జగనన్న కాలనీకి వెళ్లే రహదారి



అడవిని తలపిస్తున్న కోనాడ జగనన్న కాలనీలో పెరిగిన పిచ్చి మొక్కలు

పూసపాటిరేగ : మండలంలోని కోనాడ గ్రామంలో జగనన్న కాలనీ అభివృద్ధికి దూరంగా వుంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరుతో పాటు ఇంటి బిల్లులు, విద్యుత్ సౌకర్యం వంటి పనులు ఏడాది క్రితం చకచకా సాగాయి. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత కాలనీ వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో కనీస మౌలిక సదుపాయాలకు దూరంగా కాలనీ వాసులు భయాందోళనల నడుమ జీవనం కొనసాగిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు కాలనీ వాసులు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. పిచ్చి మొక్కలు ఇష్టమొచ్చినట్టు పెరిగి విష సర్పాలకు నిలయంగా కాలనీ తయారైంది. ఇక్కడ కాలనీ వాసు అవస్థలు అధికారులు పట్టించుకోకవపోవడంతో మొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. కాలనీకి రాకపోకలు సాగించేందుకు సీసీ రహదారులుగాని, గ్రావెల్ రహదారులుగాని లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో 240 మంది లబ్ధిదారులు ఉన్నప్పటికీ అధికారులు కాలనీ ముఖం చూడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని వాపోతున్నారు. కాలనీలో కనీసం రహదారి సౌకర్యం కల్పించినా చాలా వరకు సమస్య తీరుతుందని వారు పేర్కొంటున్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న చెన్నై సాల్ట్ ఫ్యాక్టరీ అధికారులు ఆయా భూములపై కేసు వేయడంతోనే అభివృద్ధికి విఘాతంగా తయారైందని పలువురు చెబుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాలనీ వాసులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

బాధ్యతగా పని చేయాలి



సాధారణ బదిలీల అనంతరం నూతన సచివాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన అడ్మిన్ కార్యదర్శులు తమ విధుల పట్ల మరింత బాధ్యతగా పని చేయాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. బదిలీల అనంతరం స్థాన చలనాలు పొందిన అడ్మిన్ కార్యదర్శులు మరింత బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలతో పాటు రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

– విజయనగరం

ప్రభుత్వ భూమిలో కోళ్లఫారం..!

మెంటాడ: మండలంలోని జయతి పంచాయతీ పరిధి బిరసాడవలస గ్రామంలో విజయపౌల్ట్రీ వారు సుమారు 2.9 ఎకరాల భూమిని ఆక్రమించి కోళ్లఫారం ఏర్పాటు చేసినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆక్రమణలపై కొందరు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ అరుణకుమారి ఆదేశాలతో మండల సర్వేయర్ జ్యోతి, వీఆర్‌ఓఓ అప్పలనాయుడు, సర్వేయర్ సన్యాసిరావు బుధవారం సర్వే చేసి, ఆక్రమణలను నిర్ధారించారు. రెవెన్యూ సిబ్బంది కోళ్లఫారం యాజమాన్యానికి నోటీసులు అందజేశారు. త్వరలో ఇరిగేషన్ అధికారులు కూడా సర్వే చేయనున్నారని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలు..

కోళ్లఫారం యాజమాన్యం చేసిన భూఆక్రమణపై, కోళ్లఫారం వల్ల బిరసాడవలసతో పాటు సమీప గ్రామాల ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విచారణ చేపట్టాలని పశుసంవర్ధకశాఖకు జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారని చెప్పారు.

'భోజన' కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



ఎంఈవో పాపినాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న భోజన నిర్వాహకులు

పూసపాటిరేగ : మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సూర్యనారాయణ డిమాండు చేశారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో బి.పాపినాయుడుకు భోజన నిర్వాహకులతో కలిసి ఆయన బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ భోజన నిర్వాహకులను కార్మికులుగా గుర్తించి రూ.26 వేలు వేతనంగా ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు కారణంగా వర్కర్లు తొలిగింపు ఆపాలన్నారు. ఆయనతో పాటు పలువురు మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

నగరంలో మూడు జోన్‌ల విధానం



సమావేశంలో చర్చిస్తున్న కమిషనర్ నల్లనయ్య

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా జోన్‌ల ఏర్పాటు
- మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులతో కమిషనర్ సమీక్ష

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో త్వరలో ఏర్పాటు చేయనున్న జోన్‌ల విధానానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. ఈ మేరకు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో గల ఆయన చాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ట్రాఫిక్, వన్ టౌన్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌లతో పాటు ప్రణాళిక విభాగం అధికారులతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా, నగర క్రమబద్ధీకరణకు మూడు జోన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌన్సిల్ అనుమతి అనంతరం జోన్‌ల విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్టు చెప్పారు. రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్‌లుగా విభజించనున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే వీధి విక్రయదారుల సర్వేను చేపడుతున్నామని మరో వారం రోజుల్లో సర్వేను పూర్తి చేసి గుర్తింపు కార్డులను అందజేయనున్నామని చెప్పారు. పశు సంచారాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రహదారులపై విచ్చలవిడిగా సంచారం చేస్తున్న పశువులను గోశాలకు తరలిస్తామని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు, వన్ టౌన్ ఎస్ఐ గణేష్, టూ టౌన్ ఎస్ఐ మురళి, టీపీవో అప్పలరాజు, టీపీఎస్ అనిత పాల్గొన్నారు.

నిర్దేశించిన జోన్‌ల పరిధిలోనే వ్యాపారాలు చేయాలి

నగరంలో నిర్దేశించిన జోన్‌ల పరిధిలో మాత్రమే వీధి విక్రయాలు సాగించుకోవాలని కమిషనర్ పల్లి నల్లనయ్య చిరు వ్యాపారులకు సూచించారు. ఈ మేరకు నగరంలోని తోపుడు బండ్లు వర్తకులు ఆయన చాంబర్లో కలిసి చిరు వ్యాపారాలను యథావిధిగా కొనసాగించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ నగర క్రమబద్ధీకరణ చర్యలలో భాగంగా నూతన విధానాలను అవలంభించబోతున్నట్టు చెప్పారు.

రైతుల సంక్షేమానికి కృషి



సింగవరంలో వరి విత్తనాలను వేస్తున్న ఎమ్మెల్యే

డెంకాడ: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని సింగవరం గ్రామంలో నారుమడి విత్తనాలు, రాయితీ మినుము చిరు సంచులను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి పాల్గొన్నారు. యంత్రంతో ఉబాలు చేసేందుకు అవసరమైన వరి నారు కోసం తయారు చేసిన పొలంలో వరి విత్తనాలను ఎమ్మెల్యే వేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు రైతులకు అందిస్తున్నామన్నారు. ఏడీఏ నాగభూషణం మాట్లాడుతూ వరి గట్లపై కంది సాగు చేయడం వలన రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. సింగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును వేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, ఏవో సంగీత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలి



బొప్పడాంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

నెల్లిమర్ల రూరల్: పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో రామకృష్ణరాజు సూచించారు. మండలంలోని బొప్పడాం గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇళ్లల్లో ఉన్న చెత్తను కాలువల్లో వేయకుండా ప్రత్యేక బుట్టల్లో వేసుకోవాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మురుగునీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు తెలిపారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని సిబ్బందికి సూచించారు. తాగునీటి కుళాయిల వద్ద పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. కార్యదర్శులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శంకర్ జగన్నాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

విజయనగరం టౌన్/క్రైమ్: లైసెన్స్ లేని వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేయడం చాలా ప్రమాదకరమని, అనుమానిత వ్యక్తుల వివరాలను తెలియజేయాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే అనుమానిత వ్యక్తుల వివరాలు తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబరు 14405కి గానీ, జిల్లా ఎక్సైజ్ అధికారి 9440902360 నంబరుకు తెలపాలన్నారు.

ఎస్పీని కలిసిన జర్నలిస్టులు

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా కేంద్రంలో పని చేస్తున్న జర్నలిస్టులు ఎస్పీ వకుల్ జిందల్‌ను బుధవారం కలిశారు. టూటౌన్ ఎస్సై దుందుడుకు వ్యవహారంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ నెల 27 నే సంఘటన జరిగిన వెంటనే ఏఎస్పీ సౌమ్యలతకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఏ చర్య తీసుకోలేదని పేర్కొన్నారు. దీనిపై ఎస్పీ వకుల్ జిందల్ సానుకూలంగా స్పందిస్తూ ఎస్సైపై విచారణ జరుగుతుందని, త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పూతికపేటలో సీసీ కెమెరాల ఏర్పాటు



పూతికపేటలో ఎస్ఐకు సీసీ కెమెరాలు అందజేస్తున్న దాతలు

నెల్లిమర్ల రూరల్: నేరాల నియంత్రణకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎస్ఐ గణేష్ తెలిపారు. మండలంలోని పూతికపేట గ్రామంలో బుధవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సులభతరం అవుతుందన్నారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో అన్ని ప్రధాన జంక్షన్లలో కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పతివాడ శ్రీనివాసరావు, యడ్ల గోవింద, తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ యూనివర్సిటీతో సీతం కళాశాల ఒప్పందం



ఒప్పంద పత్రాలతో సీతం విద్యా సంస్థ డైరెక్టర్ డాక్టర్ శశిభూషణ్‌రావు, కేఎల్ యూనివర్సిటీ ప్రతినిధి బాబు హరికృష్ణ

విజయనగరం అర్బన్: పట్టణంలోని సీతం విద్యా సంస్థ కేఎల్ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కేఎల్ టెక్నాలజీ ఇంకుబేటర్స్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాబు హరికృష్ణ లంక, సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ్‌రావు ఒప్పందంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యూహాత్మక భాగస్వామ్యం విద్యార్థులలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత మరియు ఉద్యోగ సృష్టిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భారతీయ అంకుర సంస్థల పర్యావరణ వ్యవస్థ యొక్క పాత్ర మరియు పనితీరును వివరించారు. ఉపాధి అవకాశాలను సృష్టించడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, డీన్ డాక్టర్ జీవి.ప్రసూన, కళాశాల విద్యార్థులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.







● గొడుగు చాటున...

విజయనగరంలో కొద్ది రోజులుగా రోజూ వర్షం కురుస్తుండడంతో వివిధ పనుల నిమిత్తం ఇళ్ల నుంచి బయటకు వచ్చేవారు గొడుగు లేనిదే రాలేకపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదం బారిన ఈ చిత్రాల్లో చూపించినట్టు ప్రయాణం సాగిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

పరామర్శ

భోగాపురం: మండలానికి చెందిన జర్నలిస్ట్ శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన సంతాప సభను భోగాపురంలో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సంతాప సభకు హాజరై శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.